# ★ పాపిష్టిసంఘం! ★

శ్రీ దున్నా కృష్ణారావు

ఆ వేళ ఆదివారం. మా ఆఫీసుకు శెలవు. ఏమైనా కాలక్షేపంజేయటానికి మా మిత్రవర్యుడు ఆచార్యు వూళ్ళోలేడు. ఏమీ తోచడంలేదు! అందుకని గోదావరి ఒడ్డుకెళ్ళి కూర్చుందామని బయలుదేరాను. తిన్నగా గోదావరిఒడ్డుకెళ్ళి ఏకాంతంగా చీడీలమీదకూర్చున్నా, గోదావరి అలల్నిచూస్తూ. అంతలో "పాపిష్టిసంఘం! నా ఉమను పొట్టపెట్టుకొంది. కమలం లాగ వికసించే నా కుసుమాన్ని కాలితో నలిపేసింది పాడు సంఘం! అన్యాయంగా! నిర్దాక్షిణ్యంగా!" అనే మాటలు నా వీనుల బడ్డాయి. నేను వెనక్కి తిరిగి చూడగా కృశించిన శరీరంగల పాతిక సంవత్సరాల యువకుడు చిరిగిన బట్టలూ మాసిన తలతో గొణుగుకుంటూ పోతున్నాడు. నేనామాటలు విని అక్కడ కూర్చోలేకపోయాను. అసలు సంఘంచేతిలో దెబ్బ తిన్న నాకు అటువంటి మాటలు వింటే పూర్తిగా తెలుసుకొనేవరకూ తృప్తికలగదు. వెంటనే అతని దగ్గరకు పరిగెత్తికెళ్ళి చెయ్యిపట్టుకొని "అబ్బాయి! నువ్వెవరవు? మీదేవూరు, ఉమా! అంటున్నావు ఏంటాసంగతి చెప్పవూ" అని అడగ్గా "ఏమీలేదండీ, నా సంగతంతా చెబితే మీరు నవ్వుతారు పోనివ్వండి" అంటూ చెయ్యి విదుల్చుకోబోయాడు, కాని నేను అతన్ని చెయ్యిబట్టుకొని నెమ్మదిగా ఆపి వెనుక కూర్చున్నచోటుదగ్గర కూర్చోబెట్టి అడిగాను.

"అయ్యా అందరూ నన్ను పిచ్చివాడనుకొని నావైపు చూస్తూ నవ్వుతూపోతుంటారు. మీరు నన్ను గ్రహించి తెలుసుకొనగలిగారు. ఈ పాడు సంఘంలో బ్రతకడం దుర్లభమండి" అనగానే నేను, "యేమిటీ, అటువంటిపని యెవరుచేశారు? మీ దేకులం? అని అడిగాను. నాది బ్రాహ్మణకులమండి, నాపేరు శంకర్రావంటారు. చెప్పొచ్చేదేంటంటే యీ బ్రాహ్మణజాతేనండి ఎటువంటి యాడిగాలకైనా లొంగుబడి పాపకార్యాలు చేస్తూంటుంది. మీరు నన్ను యింత దయతో అడుగుతున్నందుకు చెబుతా వినండి.

"మాది రామచంద్రపురం. మా తండ్రికాట్టే ఆస్తిలేదు. ఉన్నకాస్తభూమి పుర్రా అప్పులవాళ్ళవశం అయింది. దాంతోబాటు మా తల్లిదండ్రులు కూడా పోవడంచేత నేను వంటరివాడనయ్యాను! ఆవూళ్ళోనే మా మేనమామగారుండేవారు. ఆయన నన్ను జేరదీశాడు! ఆయన నన్నెంతో ఆదరంగాచూస్తూండేవాడు.

ఇలావుంటూండగా మా మావయ్యకూతురయిన ఉమ నేనూ ఒకదగ్గరేభోంచేస్తూ ఒక మంచమీదే పడుకొని కథలు చెప్పుకుంటూ చిన్నతనాన్నంతా గడిపేసాము. ఇలా మా మావయ్య చూస్తూవుంటే మా అత్తయ్యకు నేనంటే పీకలమొయ్యాకోపంగా వుండేది. ఏదో వంకబెట్టి తిడుతూనే వుండేది. ఉమా నేను ఆడుకుంటంచూసి మా మావయ్య "యెంతో ముచ్చట" పడేవాడు. కాని మా అత్తనమీద కోపం చొప్పున ఉమనుకూడా తిడుతూంతేది పాపం!

నేనెలాగో మా మావయ్యదయవల్లా స్కూలు ఫయినల్ ప్యాసయ్యాను. మొదటి సంవత్సరంలో ప్యాసవ్వడంవల్ల మా మావయ్య చాలా మెచ్చుకున్నాడు. ఇంటర్ కోర్సుకూడా చెప్పించాలని నన్ను రాజమహేంద్రవరం అప్లికేషను ఆర్ట్సు కాలేజీకి పెట్టమన్నాడు. రాజమండ్రి అప్లికేషను పెట్టాను. సీటొచ్చింది. నేను స్కూలుఫయినల్ ప్యాసవ్వక పూర్వమే ఉమ! పుష్పవతి అయింది. అప్పటినుంచి నేను కనబడినప్పుడల్లా తలుపుచాటుకువెళ్ళి నన్ను వారచూపులతో చూస్తూ మనస్సులో బాధపడుతుండేది. కాని నేనొక రోజున స్కూలుకువెళ్ళి పుస్తకం మరిచిపోవడంచేత ఇంటికొచ్చాను. మాఅత్త యింటిదగ్గర లేదు. ఉమ మాత్రం యింటిలో లేసల్లుకుంటూంది. నేను గదిలో ప్రవేశించగానే నన్నుచూచి త్రుళ్ళిపడింది. ఏం! ఉమా నన్నుచూచి త్రుళ్ళిపడుతున్నావని అనగానే పిచ్చెత్తినట్టు నావేపుచూడ్డం మొదలెట్టింది. వెంటనే దగ్గరకెళ్ళి చెయ్యిపట్టుకున్నాను. సిగ్గుతో బుర్ర వంచుకుంది. ఉమా......మాట్లాడవేం?......కోపం వచ్చిందా? అని అడగ్గా ఒక్కసారి తలపైకెత్తి కళ్ళ కొలకుల్లో కన్నీరు నింపుకొని నా ముఖం తేరిపారచూచింది... మళ్ళొకసారిచూచింది! అంది "బావా! నాకేం కోపం చెప్పు" "అయితే, మరెందుకలా సిగ్గుపడుతున్నావు? ఏం! నేను మునపటిబావనుగానా?" "కాదుబావా! యీ అమ్మపెట్టే సతాయింపులకు సంఘానికి భయపడి

అలా సిగ్గుపడాల్సివస్తోంది. అంతా ఏమనుకుంటారో! అని నిన్ను మునపటిలా పలకరించలేక పోతున్నాను. ఏంచేసిదిబావా! నాహృదయం ఎంతబాధగా వుంటుం దనుకొన్నావు? నీవేమీ అనుకోకు బావా! అంది. ఆమాటలు నన్ను వశంచేసుకొన్నాయి. "నిజమేఉమా" అని దీర్ఘనిట్టూర్పు విడచేను. ఆవేళ నాకు మంచినీళ్లు యిస్తూంటూండగా మీఅమ్మ నిన్నుపిలిచి అన్నమాటలు నా చెవుల్లో యింతవరకు గింగురుమంటున్నాయి. ఏంచేస్తాం! ఈ పాపిష్టిసంఘంముందు పవిత్రప్రేమకు చోటు విలువలేదు! అంచేత నన్నికనుంచి "బావా" అని పిలవకు. అని అనగానే మా ఉమకు కళ్లంటనీళ్లు గిర్రున తిరిగాయి. "బావా" నీవలా అనకు అమ్మ ఎన్నిఅన్నా ఆఖరుకు నీతో మునుపటంత చనువుగా వుండకపోయినా !"బావా" అనిమటుకు పిలవనియ్! "ఆ రెండక్షరాలేగా!" ఆ మాటలు వినేసరికి నన్ను నేను మరచిపోయాను! పెదిమలు అల్లాడేయి. వెంటనే మా నాలుగు పెదిమలు ఏకమయ్యాయి! నాలుగుకళ్లు మిళితమయ్యాయి!.........ఎందుకండీ బాబుగారు యిదంతాచెప్పి నా మనస్సుఅంతా చెదర గొట్టుకొంటం అంటూ దీర్ఘనిట్టూర్పు విడిచేడు పిచ్చివాడు.

"అయ్యోపాపం!"అంటూ "తరవాతఏమైందీ?" అని ప్రశ్నించా యింకా వినాలనే కుతూహలంతో "అదే నాతొలి, తుదికలయిక మాఉమతో." స్కూలు ఫయినల్. ప్యాసయినతరువాత కాలేజీకి అప్లయి చెయ్యగా సీటొచ్చింది. నేను ప్రయాణానికి సామా నంతా సర్దుకుంటూంటే మాఉమ తలుపుప్రక్క నిలబడి జాలిగొలిపే దృక్కులతో "బావా" వెళ్లుతున్నావా? "జ్ఞాపకంవుంటానా" అని ఒక చిరునవ్వు నవ్వింది. వెంటనే నాకు జ్ఞాపకంరాగా నాపోటో ఒకటి పెట్టి లోంచితీసి ఉమ కందిచ్చాను. ఇంతలో ఎక్కడ చూసిందో "ఒసేయీ! ఉమా! అంటూ ఒక పొలికేక వేసింది దొడ్లోంచి మాఅత్త. ఆ కేకవిని పులికేకకు జడిసినలేడిపిల్లలా ఒక్కపరుగునపోయింది. నేనుప్రయా ణమై రాజమండ్రీ వచ్చేశాను.

నేనువచ్చిన రెండుమాసాలికి పచ్చటిబొట్టులు పెట్టిన శుభలేక ఒకటివచ్చింది. ఆవుత్తరం తీసిచూడగా ...చి॥ సౌ॥ ఉమను...పేరావధానులుకిచ్చి వివాహం జరుపబడును. క్రింద మామయ్యపేరుంది. ఆవుత్తరం చూసి ఆలోచిస్తూ గంటసేపు అలాకూర్చుండిపోయాను. ఈపెళ్ళి ఎవరుకుదిర్చారో నాకర్థం అయింది. నాకు చేయకుండా మా అత్తపోరుపడలేక మా మావయ్య యీపని చేసుంటాడు. ఈ వివాహం కుదిర్చినరోజున నాఉమ ఎంతదుఃఖించి ఉంటుందో! పాపం! నన్ను నమ్ముకున్న ఉమ నాకు కాకుండా యింకో గమ్మారయిన పేరిగాడికి నిశ్చయపరిచారట. అని నాలో నేను ఎంతో నొచ్చుకున్నాను. నా స్కూలుఫైనల్ చదువు తున్నరోజులు జ్ఞాపకం వచ్చాయి. పెళ్లికెళ్లాలన్న యిష్టంలేదు. కాని కన్నతండ్రిలా పెంచుతున్న మామ మాట తీసినట్టుంటుందని పెళ్లికెళ్లాను. వెళ్లినా ఉమను కనిపించలేదు, కనిపిస్తే ఆమె మరీ బాధపడుతుందని. పెళ్లయిపోయింది. ఆరోజుండి మరుచటిరోజున మా మావయ్యదగ్గర సెలవుతీసుకొని బరువెక్కిన హృద యంతో వచ్చేసాను."

"అయ్యో! చాలా అన్యాయం జరిగిందే!" అని నేనన్నాను తరవాతచెప్పండి. "ఇలా ఒక సంవత్సరం గడిచింది. మా ఉమదగ్గిర్నుంచి నిష్ఠూరంమాటలతో ఒకసారి రమ్మంటూ ఉత్తరాలొస్తూనే ఉన్నాయి. కాని నా మనస్సు వెళ్లడాని కంగీకరించడంలేదు. సెలవుల్లో యింటికెళ్లాను. కాని ఉమలేనియిల్లు స్మశానంలా కనబడింది. నేనుకూడ ఒకశవంలా రెండు నెల్లూ అక్కడే గడిపాను. మా అత్తపోరుతో. రెండో సంవత్సరం జరుగుతోంది. ఉమదగ్గిర్నుంచి "బావా! ఒక్కసారి నీవు రావాలి. నేను చచ్చిపోయేస్థితిలో వున్నాను. ఇదివరకు ఎన్నివుత్తరాలురాసినా జవా బివ్వలేదు. నేను జ్వరముతో బాధపడుతున్నాను. నాకు బ్రతుకుమీద ఆశలేదు. నిన్నుచూచి ప్రాణం విడవాలనే యింకా ప్రాణాలు నిలబెట్టుకున్నాను." అని ఒకవుత్తరంవచ్చింది. అది చూచాను. నాకళ్లంట నీళ్లు బొటబొట కారాయి. కట్టుబట్టలతోనే పెట్టెలో సొమ్ముతీసుకొని బయలుదేరాను. ఇన్నాళ్లనుంచి మా అత్తమీదకోపం చొప్పున ఉమనుచూడ్డానికి వెళ్ళ లేదు. అత్తచేసిన నేరానికి ఉమను నిష్కారణంగా బాధపెట్టాను. బరువెక్కిన హృదయంతో రైలెక్కి సాయంత్రం పోలిరెడ్డిపాలెం జేరుకున్నాను. ఇంకేం వుంది నేను వెళ్ళగానే ఇంట్లోవాళ్ళందరు విచార ముఖాలతో ఏడుస్తున్నారు. నేను ఆగదిలోకి వెళ్లాను ఉమ నన్నుచూచింది. లేవడానికి శక్తిలేదు. నేను

గబగబ మంచందగ్గరకెళ్ళి ఉమచెయ్యి పట్టుకున్నాను. ఉమ నాచెయ్యిపట్టుకొని తనవక్షస్థలంమీదికి తీసుకుంది. "బావా" వచ్చావా అని అంటూ చిరునవ్వు ముఖంతో కళ్లుమూసింది. ఇంకేముంది ఇక నాఅవస్థ అప్పుడేలావుందో చెప్పలేను! ఆరోజున ఉమను స్మశానానికి తీసుకెళ్లి దహనంచేస్తూంటే నా హృదయం దహనంచేసినట్టయింది. ఇక చదువులేదు సంధ్యాలేదు. నా ఉమ అగ్నిహోత్రుడికి ఆహుతి అయిపోతుంటే నాకు దుఃఖం, క్రోధం, నిరాశ ఒక్కసారి పుట్టాయి. ఆ దగ్ధమయిపోతున్న వహ్నిలో న్యాయాన్యాయాన్ని ఆలోచించని—పవిత్రప్రేమకు చోటివ్వని — పాపిష్టి సంఘాన్నిపడేసి దగ్ధం చేయాలన్న బుద్ధిపుట్టింది. నా ప్రాణమైనఉమేపోయినప్పుడు యిః నాకుచదువెందుకు. నామనస్సు మనస్సులోలేదు. మనస్సులో ఉన్మాథం కలిగింది. ఆవేశం విజృంభించింది. ఆ మంటలో పడిపోయాను. కాని అప్పటికి ఉమతో కలుసుకోలేకపోయాను. ఇంకా యీ పాపిష్టిలోకంలో వుంచడానికే కాబోలు అక్కడివాళ్లంతా బయటికి లాగేశారు. ఇక చేసేదిలేక నా హృదయలక్ష్మి ఉమనుతలుస్తూ ఆరాధిస్తూ యిలా తిరుగుతూన్నాను. "సంఘం పిచ్చివాణ్ణి అనుకుంటుంది! నవ్వుకుంటుంది తనలోతానే! కాని మీవంటివాళ్లు నిజాన్ని గ్రహించడానికి యిలా అనుగ్రహించారు. బాబూ! యిదీ నాకథ. యిదంతా చెప్పి మీమనస్సుకు బాధకలిగించానేమో క్షమించండి!"

"లేదుశంకరం," నిజంగా యీకథంతా చెప్పించి నీహృదయానికి బాధకలిగించినందుకు నిన్నే క్షమార్పణ కోరుకోవలసింది! కాని నీలాంటిపవిత్రప్రేమారాధకులు యీ సంఘపిశాచానికి ఎంతఘోరంగా! ఆహుతైపోతున్నారోకదా! ఛీ! పాపిష్టిసంఘం! ధిక్ ...... సంఘవిప్లవంరావాలి. అప్పటికికాని సంఘంలో న్యాయమనేది నిలకడగా వుండదు. పవిత్రప్రేమకు విజయం చేకూరదు." "అయితే బాబూ! మీరూ నావంటి పిచ్చివాళ్లేనా!" అనగానే నేను గతుక్కమన్నాను. నా సంగతంతా తెలుసుకొని కొంతసేపటియ్యాక గతించిన సంగతులన్నీ జ్ఞాపకం రావడంవల్లగాబోలు హృదయబాధితుడై "సంఘం! పాపిష్టిసంఘం! అంటూను, ఉమా! ఉమా! అంటూ అక్కడనుంచి లేచిపోయాడు. నేనూ కూడ దీర్ఘనిట్టూర్పువిడుస్తూ యింటిమార్గం బట్టాను.



రాట్నంతో నా
స్వరాజ్యం
అంటూ ఈసడించే
ప్రబుద్ధులు

"అమృతప్రాశ"తోనా
ఆరోగ్యం
అంటూ సందేహించే
దురదృష్టవంతులు
దేశంలో
ఇంకా ఉన్నారు.

అట్లాంటివారు
ఇకనైనా
జాడ్యం చేయకుండా
రాట్నాన్ని చేబట్టిన్నీ
"అమృతప్రాశ"ను సేవించిన్నీ
దేశాన్నీ - దేహాన్నీ
ఉద్ధరించుకోవడం
మంచిది.

స్వామీస్ 'అమృతప్రాశ'

అశ్వినీ కుమార్ ఫార్మసి
నర్సాపురం.